


# అప్పలసామి ఆత్మహత్య

అగేహానంద

బస్స్టాండును కావిలించుకుని గంటన్నర సేపు తపస్సు చేసినా భాగ్యనగరవాసి అప్పలసామికి బస్సు దొరక లేదు. మామూలుగా నెమ్మదస్తుడైనా ఈసారి నిఝంగా కోపం వచ్చేసిందతనికి. 'వెధవ బస్సు' అని గట్టిగా తిట్టుకుని చేసేదేం లేక కాలినడక మొదలెట్టాడు. ఏదీ ఆలోచించకుండా వుండగలగడం మెదడుకు చేత కాని పనుల్లో ఒకటి. కాని శివుడాజ్ఞ లేనిదే చీమకూడా కుట్టదంటారు. ఆ పరమేశ్వరుని అనుమతి లభించినట్టుంది, అప్పలసామి మెదడులో కందిరీగల్లా లేచాయి ఆలోచనలు. ఈ కుళ్లు సంఘాన్ని సంస్కరించి పారేయాలని ఒక్కసారిగో అయిడియా వచ్చిం దతనికి; పైగా ఇంతకాలం ఆ అయిడియా రానందు కాశ్చర్యంకూడా కలిగింది కాస్సేపు. సంఘంలోవున్న కుళ్ళుకూ, ఆర్టీసీ బస్సులకూ ఏం సంబంధం లేదంటే వినిపించుకునే మూడ్‌లో లేదు అతను. దేశంలో లంచగొండితనం బలిసిపోబట్టే తనకిప్పుడు నడవాల్సిన ఖర్మ పట్టిందన వచ్చు— అదేమంటే —

తనుమాత్రం ఎంతకాలం సహించి వూరుకోగలడు. మనిషి ఓర్పును కరకరా నమిలి మింగేస్తోంది ఈ సమాజం. అసలది సమాజం తప్పుకాదు; అది రోగంతో బాధ పడుతూంది. ఫుట్‌పాత్‌మీద ఎవరో తోడిస్తేవాడు అడుక్కుంటుంటే ఐదు పైసలబిళ్ల వాడిపైకి విసిరేసి రెండు నిముషాలు మౌనంగా వాడికోసం జాలిపడి మళ్లీ ముందుకు సాగాడు. ఇలాంటి సంఘటనలవల్ల సంఘాన్ని సంస్కరించాలనీ, లోకోద్ధరణకు పూనుకోవాలనీ, అంధకారంలో — అంటే అజ్ఞానాంధకారంలో దారితెలియక కొట్టుమిట్టాడుతున్న అశేష మానవాళికీ వెలుగు కిరణమై వ్యాపించాలనీ అప్పలస్వామికి ఉబలాటం క్షణక్షణానికీ పాకిస్తానంవాడి కోపంలా పెరిగిపోతుంది.

తనలో మాత్రం సలసలా మరిగే రక్తం ప్రవహించడం లేదూ! ఎందుకులేదు, బోలెడుంది. లేదని అనే దమ్ము లెవరికేనా వుంటే రమ్మనండి. బెంగాలీ కుర్రాడైనా

సరే—తాను గడ్డం గీక్కుంటున్నప్పుడు వచ్చిచూస్తే లెంపలేసుకుని మరీ వప్పుకుంటాడు. మొన్నోసారి పక్కింటి బామ్మగారు సరిగ్గా తాను గడ్డం చేసుకుంటున్న టైముకే తీరుబాటు చేసుకునివచ్చి కళ్ళు తిరిగి పడిపోయి రెండ్రోజులు ఊష్ణం తెచ్చుకున్నారు. ఇక తేలాల్సింది తన రక్తం పొగలు సెగలు కక్కేంత వేడిగా వుందా అని. చిద్విలాసంగా నవ్వుకున్నాడు అప్పలసామి. పిచ్చివాడా! నిప్పు ఎక్కడేనా చల్లగా వుంటుందా? ప్రవహించే నీరు అపరిశుభ్రంగా వుంటుందా? కాని, ఇక్కడ అర్జంటుగా మన రాజధాని మధ్యగా ప్రవహిస్తున్న మూసీనదీ దాని తాలూకు కంపు గుర్తుకు రావడంతో అప్పలసామి మొహంలో చిర్నవ్వు ఎగిరిపోయింది. ఓక్షణంపాటు ఆగి సర్ది చెప్పుకున్నాడు. ఇందాక బస్సు దొరక్కుండా పోయినప్పుడు కండక్టరును ఎంత గట్టిగా ఝూడించి పారేశాడు. ఫూర్ ఫెలో! బస్సుతో వెళ్ళిపోయాడుగానీ లేకపోతే తానన్న మాటలకు ఆ బస్సుకిందేపడి సూయిసైడ్ చేసుకునేవాడు. ఆ తరవాత అతడిని ఆత్మహత్యకు ప్రోత్సహించినందుకు చట్టంకింద తను అరెస్టయ్యేవాడు. ఇంకా నయం! అయినా తన కోపపు వేడినీ, సలసలా కాగుతూన్న రక్తపు వేడినీ ఇలా సాధారణ మానవులమీద చూపించకూడదు — ఇలా వెంటనే తీర్మానించుకున్నాడు అప్పలసామి.

ఎందుకేనా మంచిదని అనుమాన నివృత్తి కోసం తోవలో, థర్మామీటర్ కొనుక్కుని మరీ వెళ్ళాడు గదికి. తీరాచూస్తే ఎర్ర గీతకు కొద్దిగా కిందికివుంది పాదరసం. తలుపులు వేసుకుని మరీ వ్యథపడ్డాడు— ఇలా చెడిపోయిన థర్మామీటర్‌ను తనకంట గట్టిన సమాజంమీద జాలి, కోపం మరీ ఎక్కువైపోయాయి అతనికి. ఇక వూరుకుని లాభంలేదు. బ్రహ్మచారిగా వుండగానే నడుం బిగించాలి—గృహస్థాశ్రమం స్వీకరిస్తే వీలుపడకపోవచ్చు. కట్టుకున్న కోమలి కొంగుచ్చుకు తిరగడానికీ, ఆవిడ అందించిన చిరుగు సంచీ పుచ్చుకుని వెచ్చాలు తీసుకు రావడానికీ రోజులు అంకితమైపోతాయి. యువకుడైన తను చలిమిడి ముద్దలా చదికిల పడిపోగూడదు—వెంటనే కార్యదీక్ష పూని రంగంలోకి దూకాలి.

ఇలా వింతమేంది చెడిపోయిన థర్మామీటర్లు కొనుక్కుని బాధపడుతున్నారో తలచుకుంటే గుండె తరుక్కుపోయింది అతనికి. ఆ రాత్రి బలవంతంమీద నిద్రాపుకుని ఆలోచించి ఆలోచించి ఒకనిర్ణయానికి వచ్చాడు. గాంధీజీ అన్నట్టు మనిషిని మార్చాలి కాని పరిమార్చకూడదు. గాంధీగారి దేశంలోపుట్టి తాను నక్సలైట్ బ్రాండు ఆలోచనలు దగ్గరికి రానివ్వకూడదు. ఇకపోతే తనకు మిగిలింది కలం. ఈ అయిడియా రాగానే ఒక్కగెంతులో బట్టలస్టాండుమీద పడి ఫాంటు జేబులు వెదికి చూచుకున్నాడు. అమ్మయ్య! తన పేనా భద్రంగానేవుంది. ఇక తను ఏమాత్రం ఆలస్యంలేకుండా తావులకు తావులు రాసి పారేస్తాడు. ఈ మనుషులంతా అది చదువుకుని సిగ్గుతో తలలు వాల్చుకుంటారు. వాళ్ళ మెదడులో తాను చెడామడా ఏకిన విషయాలు సైకిళ్లేసుకుని మరీ తిరుగుతాయి. ఒకటోరెండో అలా బస్సులో ఇంకొంచందూరం పోయి వాళ్ళ హృదయాల్లో పరివర్తన తీసుకువస్తాయి. ఇక ఈ సంఘం బాగుపడేందు కట్టె కట్టెం పెట్టాడు.

నిశ్చింతగా నిద్రపోయాడు అప్పలసామి లైటేనా ఆర్పకుండా.

మర్నాడు కూడా అదే ఆలోచనల్తో సతమత మయ్యాడు అప్పలసామి. లోకాన్నుద్ధరిద్దామనే ఆకాంక్ష అతన్ని ఆఫీసులో ఏపనీ చేయనివ్వలేదు ఆ రోజంతా. జనరల్‌గా వ్యాసాల్రాస్తే లాభంలేదని లంచ్‌టైం లోపల నిర్ణయించుకున్నాడు. చాలామందికి వ్యాసాలంటే పడదు. కథలైతే అంతా చదువుతారు. థీమ్‌కోసం ఏదేనా తీవ్ర సమస్యను వెదికి మరీ మొదలెట్ట దలుచుకున్నాడు.

'సమాజంలో ఇది తీవ్ర సమస్య అనీ అది కాదనీ అంటానికి వీల్లేదు,' బర్కిలీ వెలిగించుకుంటూ జవాబిచ్చాడు కుప్పుసామి, 'ఒకసారి విప్లవంవస్తే అన్నీ సరుకుంటాయి...'

'నేనడిగింది కథ వ్రాయడానికి థీం కోసం.' అప్పలసామి జ్ఞాపకం చేశాడు.

'అదే నేనూ చెబుతున్నాను. విప్లవం ఎప్పుడో వస్తుంది, ఈ సంఘం బాగుపడుతుందనే భావాలతో చేతులు ముడుచుక్కూర్చోకుండా ఆ విప్లవం త్వరలో రావడానికి దోహదంచేయి. విప్లవాత్మకమైన రచనలు చేసి ప్రజలను ఉత్తేజపరుచు. సర్వమానవ సమానత్వం తీసుకువచ్చి ఈ సంఘంలోని తారతమ్యాలను రూపుమాపే సంచలనంకోసం కృషిచేయి. రష్యాలో చైనాలో వచ్చి మనదేశంలో విప్లవం రాకపోవడం అంతర్జాతీయ స్థాయిలో మనకు తలవంపులు కలుగజేయడం లేదూ?'

ఇలా ఉపదేశంచేసి రాయల్ ఎన్‌ఫీల్డ్ మీద బుల్లెట్‌లా దూసుకుపోయాడు కుప్పుసామి.

'కుప్పుసామి వెళ్ళిపోయిం తరవాత జ్ఞాపకం వచ్చింది అప్పలసామికి, వాడతేతో ఫెడరేషన్ సభ్యుడని! హారా! అనుకున్నాడు. ఇంకా నయం వెధవ తన్ను బ్రెయిన్‌వాష్ చేశాడుకాదు. కుప్పుసామికి మోటారుసైకిలూ, తొందరా వున్నందుకు మొదటిసారి సంతోషించాడు. అప్పలసామి, ఇంతలో తన కర్తవ్యం గుర్తుకువచ్చి తోవలో సహోద్యోగి వెంకటసామి ఇంట్లో దూరాడు.

'నిరుద్యోగ సమస్య,' రెండు ముక్కల్లో తేల్చాడు. వెంకటసామి 'సోషలిజం, సోషలిజం అంటూ ఎన్ని నినాదాలేసినా లాభం లేదు. మొదట కావలిసింది ప్రతివాడికీ పని —శోషలిజంకాదు. కొత్త ఫ్యాక్టరీలు తెరవాలి, కొత్తడాములు కట్టాలి, కొత్త మిల్లులు ప్రారంభించాలి, అలా అయితేనే గాని దేశంలో వుత్పత్తి పెరగదు. ఇంత మంది ఇంజనీర్లు వుద్యోగాల్లేక ఏడుస్తూంటే ఏ దేశంమాత్రం బాగుపడుతూంది? వీళ్లవుసురు కొట్టి ఎంతవచ్చని దేశమైనా భగ్గున మండిపోతుంది. మరి పాకిస్థానంవాడు దుర్మాక్రమణ చేశాడంటే చేయడూ! పైగా వాడికి అమెరికా, చైనాల మద్దత్తు కూడ...'

మన దేశంలో నిరుద్యోగ సమస్యకూ, పాకిస్థానంవాడి దుర్మాక్రమణకూ, 'తనడిగిన ప్రశ్నకూ సంబంధమేమిటో అప్పలసామికి అంతుపట్టలేదు. అతనికి తెలిసిందల్లా వెంకటసామి తమ్ముడు కృష్ణసామి ఇంజనీరింగు రెండవ సంవత్సరం చదువుతున్నాడని తమ్ముడు బి. ఈ. పాసయ్యేలోగా (అంటే మరో పదేళ్ళలోగా) దేశంలో నిరుద్యోగ సమస్యను నిర్మూలించడమో

అని అర్థం వచ్చేలా అందరి దగ్గరా వెంకటసామి గోడు వెళ్లబోసుకుంటాడు.

వెంకటసామి అంతుపొంతు లేకుండా లెక్చరు దంచేస్తుంటే బోరుకొట్టి తలకాయ అటు వేపు తిప్పితే వెంకటసామి కూతురు కనిపించింది. తలుపు చాటుగా నిల్చబడి అప్పలసామినే కన్నార్పకుండా చూస్తుంది. అప్పలసామి అటు చూడగానే సిగ్గుపడి లోపలికి తుర్రుమని పారిపోయింది. కాని, ఆ చూపుల్లోని సందేశం అప్పలసామికి అప్పుడే అందింది. ఆ అమాయక కళ్ల లోతుల్లోంచి ప్రసరించే వెలుతురు చూడ గలిగాడు. ఇక ఆలస్యం అయితే వున్న మెదడు కాస్తా వెంకటసామి తినేస్తే కథలు రాసుకోవడాని తనకేం వుండదు.

ఒకటి, రెండు, మూడు...మనసులో అనుకుని తెరిచివున్న తలుపుల్లోంచి ఒక్క అదటున పరుగెత్తి రోడ్డుమీద పడ్డాడు. ఈ వెంకటసామి ఐదేళ్ల కూతురు (ఇక్కడ పాఠకులను నిరుత్సాహపరిస్తే క్షమించాలి) పెరిగి పెద్దదౌతూంది. మన దేశంలో పుట్టిన ప్రతి ఆడపిల్లకూ పెళ్లి కంపల్సరీ. పెళ్లి అంటే వెంటనే కట్నం జ్ఞాపకం వస్తూంది మనకు.

ఆ రాత్రి నిద్రాహారాలు మాని కాగితాల క్కాగితాలు రాశాడు అప్పలసామి. మర్నాడు పక్కింటి ముత్తుసామిచేత ఆఫీసుకు లీవు లెటర్ పంపించేసి కూర్చుని ఆ కాగితా ల్లోంచి ఏరిఏరి ఓ పదికాగితాలు బయటకు లాగాడు. వాటిమీద ఇష్టం వచ్చినట్లు ఒకటినుండి పది అంకెలువేసి కవర్లోకి తోసి. జి. పి. ఓ. కు వెళ్లి మరీ పోస్టు చేశాడు.

ఆ తరవాత నిశ్చింతగా సాయంత్రందాకా నిద్రపోయాడు. కథ తిరిగి వస్తుందన్న బెంగ ఏమాత్రంలేదు. అది తిరిగి రాకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకున్నాడు. ఉదాహ రణకు స్టాంపులతోకూడిన చిరునామాగల కవరు జతవేయలేదు.

అప్పలసామి నిరీక్షణకూ, అచంచల ఆత్మవిశ్వాసానికీ, ఫలితంగా, ఓరోజు ఆఫీసు నుండి మోహం వేళ్లాడేసుకునివచ్చి నీర్సంగా తలుపుతీసినప్పుడు పోస్టుమాన్ వదేసి పోయిన పత్రిక కనిపించింది. అప్పలసామి బ్రహ్మానంద భరితుడై ఆరోజంతా సంతో షించి మర్నాడు ఆఫీసులో కనబడ్డ వాడి కల్లా ఈ శుభవార్త చెప్పుకోసాగాడు. ఆ కనబడ్డ వాళ్లంతా కూడబలుక్కుని ఓ పార్టీ కూడ వూడగొట్టారు, ఆ సాయంత్రమే.

అయినా ఫరవాలేదులే అనుకున్నాడు అప్పలసామి. వీళ్లంతా అమాయకులు. వీళ్లను క్షమించు అంటూ ఆ రోజు రాత్రి మరిచిపోకుండా భగవంతుణ్ణి ప్రార్థిం చాడు. కథను ఎనభై రెండోసారి చదువు కుని మురిసిపోయాడు. వరకట్నవారాన్నీ, దాన్ని పుచ్చుకునే వాళ్లనూ, ఇచ్చేవాళ్లనూ నిష్పక్షపాతంగా, నిర్మొహమాటంగా కట్టు గట్టి దుమ్మెత్తి పోశాడు దాంట్లో. స్త్రీ లింగం సంతులుగారికంటే ఘాటుగా రాశాడు తను. అబ్బ! ఏం డైలాగులు. ఇక వరకట్న సమస్య పూర్తిగా సమసి పోవడానికి ఎక్కువరోజులు పట్టవు. దేశ పౌరుడుగా తన పవిత్ర కర్తవ్యాన్ని, విధిని నిర్వహించాడు. తెలంగాణా, రాయలసీమా, ఆంధ్రా అనే భేదాల్లేకుండా తెలుగు వాళ్లంతా ఏకమై వరకట్న దురాచార పిశా చాన్ని తగులబెట్టి ఆ బూడిదను గంగా, యమునానదుల పవిత్ర సంగమంలో కలిపే రోజు జంబో జెట్ లో త్వరలోనే వస్తూంది.

అప్పలసామి ఇలా పంకలు గుద్దుకుం టున్న తరుణంలోనే పత్రిక తెచ్చిన పోస్టు మానే రోజుకొకటి చొప్పున మూడు పోస్టుకార్డులు మోసుకొచ్చాడు. ఆ వుత్త రాలు వరసగా ఇలా వున్నాయి.

ఒరే తమ్ముడూ,

నీవు పంపిన పత్రికా, వుత్తరం అందాయి. అది నీవు రాసినకథ అని అట్టే నమ్మకం కుదరేదు కాని నీపేరు కింద ఎర్రసిరాతో గీతలుగీసి మరీ పంపావు గనక అలానే అనుకుంటున్నాను కథపేరు బావుంది. కథకి పత్రికలవాళ్లేసిన బొమ్మ ఇంకా బావుంది.

కాని, ఏంట్రా మరీ బరితెగించి రాశావు? అన్నయ్యకు తెలిస్తే ఇంకేమైనా వుందా. వాడు ఎంతో కష్టపడి నీకు పదివేల కట్నం కుదిరిస్తే ఇప్పుడుట్రా ఇలాంటికథలు రాయడం? పెళ్లైనంతరవాత రాసుకోకూడదూ, మరీ చోద్యంగా వుంది నీపని.


మీ అక్కయ్య,

వెంకట సుబ్బమ్మ.

ఈ వుత్తరం చదివి అవతలగిర్రాటేశాడు అప్పలసామి. రెండు నెలదాకా అక్క య్యకు వుత్తరం రాయకూడదు అని తీర్మానించుకున్నాడు.

ఒరే అప్పలూ,

నీవు పత్రిక ఎందుకు పంపావో అర్థం కాలేదు నాకు మొదట. తెరిచిచూస్తే ఓ కథ పేరూ దాని పక్కన నీపేరు అండ ర్లైన్ చేసినందుకే బోధపడింది. చాలా సంతోషించానుకూడా. ఇంకా కథ పూర్తిగా



చదవలేదు— మరో రెండ్రోజుల్లో పూర్తి చేస్తాను. నీవు కథరాసిన సంగతి తెలియగానే నాకూ కూడా మూడ్ వచ్చి ఏక బిగిన్నాలుగు కథలు రాశాను. అవి పత్రికకు ఎలా పంపాలి ? పత్రిక సంపాదకుడు నీకు తెలుసునా ? నా కథలుకూడా అచ్చయేట్లు చూడగలవా ? ఈ విషయాలు తెలియ జేస్తూ వెంటనే వ్రాయగలవు.

ఇట్లు,

నారాయణసామి

ఈ వుత్తరాన్ని చింపి పోగులెట్టి వాడి కెస్తే వుత్తరం రాయకూడదని శపథం చేశాడు అప్పలసామి.

ఒరే అప్పిగా,

ఏదోలే అని వూరుకుంటే ప్రశతిమించి రాగాన పడుతుందే నీ వ్యవహారం. పిచ్చిపిచ్చి వేషాలేస్తే పళ్ళు పీకేస్తాను. బాగుపడే లక్షణాలు వున్నవాడు రాసే కథేనా అది ? పైగా తగుదునమ్మా అని డబ్బుతగలేసుకుని అన్ని పత్రికలు కొని అందరికీ పోస్టులో పంపుతావా—ఏమిటి నీ వుద్దేశ్యం? నాలుగు డబ్బులు కళ్ళజూసే వుద్యోగం దొరగ్గానే కళ్ళు నెత్తిమీదికి వచ్చాయా? నరికేస్తా జాగ్రత్త — కట్నమూ, దురాచారమూ గట్రా అంటే.

ఈ శుక్రవారం సెలవు తీసుకునిరా. వీరాసామిగారమ్మాయిని సెటిల్ చేశాను, చూద్దువుగాని.

మీ అన్నయ్య,

కుమారసామి.

మూడో వుత్తరం చదివి కళ్ళు తిరిగి పడిపోయాడు. అన్న బురమీసాలు జ్ఞాపకం వచ్చి ఆ రాత్రంతా నిద్ర పట్టలేదు. ఆ రాత్రంతా మూర్ఛనిఅన్నవుత్తరంఒకలక్షా ఎనిమిదివేల తొంభై రెండుసార్లు చదువుకొని శోషవచ్చి మంచంమీద పడిపోయాడు.

ఆ పై నెల్లో అప్పలసామి పెళ్ళి వీరాసామి అమ్మాయి సుబ్బలక్ష్మితో ఘనంగా జరిగింది.

ఆంధ్రదేశం ఒక మహోజ్వల రచయితను కోల్పోయింది.


ఇదుగో! నోటికంతా రక్షణ చేకూర్చే

టూత్ పేస్ట్ —నీమ్

నీమ్ టూత్ పేస్ట్ మీ పళ్ళను శుభ్రపరచడమేగాదు-నీమ్ టూత్ పేస్ట్‌లో ఆరోగ్య ప్రదాయిని వేప (నీమ్)కు వుండే అద్భుత లక్షణాలన్నీ వున్నాయి. పళ్ళను గట్టిపరిచి చిగుళ్ళకు రక్షణచేకూర్చి, దుర్వాసనను నివారించి, మీ నోటిని సర్వదా స్వచ్ఛంగా వుంచుతుంది.




కలకత్తా కెమికల్‌వారి ఉత్పత్తి